ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పల్నాడు
జిల్లా వార్తలు
3
శనివారం 15 మార్చి 2025





హోలీ.. ఆనందాల కేళి

రంగుల పండుగ హోలీ.. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరిగింది. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ ఆడిపాడారు.
- గుంటూరు(తూర్పు)

6



భక్తుల కోసం సిద్ధం చేసిన గ్యాలరీలు

6



భక్తులకు అందించటానికి పసుపు, కుంకుమ, పసుపు, దారం ప్యాకెట్‌లను సిద్ధం చేస్తున్న సేవకులు

నేడు శ్రీవారి కల్యాణోత్సవం

శ్రీవారి కల్యాణోత్సవానికి రాజధాని అమరావతిలోని వెంకటపాలెం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం సిద్ధమైంది. ఆలయ ప్రాంగణంలో టీటీడీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించనున్నారు.

ఇళ్లు సరే.. సౌకర్యాలు?

సమస్యల వలయంలో టిడ్కోలు



చిలకలూరిపేట టిడ్కో గృహ సముదాయం

- నివాసానికి ఇష్టపడని లబ్ధిదారులు
- వసతుల కల్పనపై అధికారులు మీనమేషాలు
- తాగునీటికి కటకట..డ్రెయినేజీ అధ్వానం.. అపరిశుభ్రత
- నాడు హడావుడి గృహ ప్రవేశాలు.. నేడుపట్టించుకోని పాలకులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఎనిమిదేళ్లకుపైగా నిరీక్షణకు తెరపడి ఇళ్లల్లో చేరినా.. ఆ ఆనందం ఆవిరైపోతోంది. గత టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించగా వైసీపీ వాటిని పాడు పెట్టి ఎన్నికలకు ముందు లబ్ధిదారుల చేత హడావుడిగా గృహ ప్రవేశాలు చేయించారు. అయితే కనీస సౌకర్యాలు సమకూర్చకుండా ఎన్నికల్లో లబ్ధి కోసం నాటి పాలకులు లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వగా ప్రస్తుతం వాటి పరిష్కారంపై పాల కులు దృష్టి సారించడంలేదు. తాగు నీటి, డ్రెయినేజీ, అపరిశుభ్రత, విద్యుత్, రవా ణా తదితర సమస్యల్లో టిడ్కో ప్రాంగణాలు నిండిపోయాయి. వందల సంఖ్యలో గృహస్తులు ఉంటున్నా తాగునీరు అంతంత మాత్రంగా సరఫరా చేస్తున్నారు. దీంతో తాగునీటితో ప్రజలు అల్లాడిపో తున్నారు. కొన్ని చోట్ల అయితే సదుపాయాలు లేకపోవ డంతో లబ్ధిదారులు టిడ్కో ఇళ్లల్లో ఉండేందుకు ముందుకు రావడం లేదు. టిడ్కో ఇళ్లల్లో లబ్ధిదారులు ఎందుకు ఉండటం లేదు.. అక్కడ నెలకొన్న సమస్యలు ఏమిటి.. ఇంకేమైనా సదు పాయాలు కల్పించాలా.. అన్న ఆలోచన కూడా అధికారు లు చేయడంలేదు. ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నా టిడ్కో ప్రాంగణాల్లోని సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి.

భయం.. భయం

తెనాలి సమీపంలోని జగ్గడిగుంటపాలెం టిడ్కో ప్రాంగణంలో ఇటీవల ఓ గృహంలో విష సర్పం ప్రవేశించి గృహిణిని కాటు వేసింది. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కాటు వేసిన ప్రాంతం నుంచి విషం పైకి పాకకుండా తాడుతో కట్టుకట్టుకుని భర్త సాయంతో దాదాపుగా 6 కిలోమీటర్లు ద్విచక్రవాహనంపై తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్న పరిస్థితి. ఈ పరిణామంతో ఇక్కడ లబ్ధిదారులు టిడ్కో ఇళ్లల్లో నివాసానికి సాహసించడంలేదు. ఇదే పరిస్థితి గృహ ప్రవేశాలు జరిగిన అన్ని ప్రాంతాల్లోనూ నెలకొంది. అపరిశుభ్రత కారణంగా దోమలతో ప్రజలు పగలు కూడా అల్లాడి పోతున్నారు. గుంటూరు అడవితక్కెళ్లపాడులో గత వైసీపీ ప్రభుత్వం కల్పించిన విద్యుత్ సదుపాయాలు నాసిరకంగా ఉండటంతో భూగర్భంలోని వైర్లు తెగి ప్రాణాంతకంగా మారుతుండటంతో మంటలు రేగి ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో లబ్ధిదారులు భయం భయంగా ఉంటున్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని దొండపాడులోని టిడ్కో ప్రాంగణం చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.



తెనాలి టిడ్కో గృహాల్లో పాము కాటుకు గురైన మహిళ

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాల్లో పేదల అద్దె ఇళ్ల కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో షేర్‌వాల్ టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను నిర్మించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు మున్సిపల్ కేంద్రాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మించారు. చాలా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జరిగి గృహ ప్రవేశాలకు సిద్ధమవగా 2019లో ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో లబ్ధిదారుల ఆశలు ఆవిరైపోయాయి. కళ్లెదుట ఇళ్లు కనిపిస్తున్నా వాటిని వైసీపీ పాలకులు 2024 ఎన్నికల ముందు వరకు పాడుపెట్టారు. లబ్ధిదారులు, ప్రతిపక్షాలు ఎన్ని ఆందోళనలు చేసినా టిడ్కో ఇళ్ల గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయరన్న ఉద్దేశంతో హడావిడిగా టిడ్కో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. దీంతో 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లా, సీఆర్‌డీఏ సహా 12 పట్టణాల్లో 32,304 టిడ్కో ఇళ్లు నిర్మించ తలపెట్టగా వాటిలో 22,068 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అయితే పెండింగ్ పనులు చేపట్టకుండా రంగులు వేసి ఇళ్ల తాళాలను నాడు వైసీపీ హయాంలో అప్పగించారు. గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేట, మంగళగిరి, సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాల్లో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్లల్లో చేరారు. అయితే తాము చేరిన ఇళ్లు రంగులు మయంగా కనిపిస్తున్నాయే కానీ అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, అపరిశుభ్రత, రవాణా సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఆయా ఇళ్లల్లో ఉండలేక గత ఏడాదిన్నరకు పైగా లబ్ధిదారులు అల్లాడుతున్నారు. గృహప్రవేశాలతో బాధ్యత ముగిసిందన్నట్లు నాడు వైసీపీ హయాంలో అధికారులు వ్యవహరించగా నేడూ అదే తీరు ఈ ప్రభుత్వంలోనూ నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీటి సరఫరా, చెత్తాచెదారాల తొలగింపు లేక, అత్యవసరమైతే వైద్యం, పిల్లల చదువులకు పాఠశాలలు, రేషన్ సరుకులు అందక ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురుచూస్తున్నా పది నెలలుగా (మిగతా 6వ పేజీలో)



పిడుగురాళ్లలో పిచ్చి చెట్ల మధ్య టిడ్కో గృహాలు

గుంటూరులో గంటే.. అదీ మురుగునీరు

గుంటూరు అడవితక్కెళ్లపాడులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా అందక అల్లాడుతున్నారు. 4,192 కుటుంబాలకు రోజుకు ఒక్క గంట మాత్రమే నీరు వదులుతున్నారు. పదహారు ప్లాట్లకు ఒక నీళ్ల ట్యాంకు నిర్మించగా, 6 అడుగుల లోతులో ఉండే ఆ ట్యాంకుల్లో రెండడుగులకు మించి నిండటంలేదు. ఆ నీరు కూడా ఉపయోగించుకోవడానికి వీలుగా లేకుండా మురికిగా వస్తున్నాయి. దీంతో ప్రజలు దగ్గరలోని స్వర్ణభారతినగర్‌కు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు.



గుంటూరులోని టిడ్కో ఇళ్లపై నిర్మించిన నీళ్ల ట్యాంకులు

అధికారులు సరఫరా చేస్తున్న మురుగు నీరు..

సమస్యలు ఇలా..

- డ్రెయినేజీల నిర్వహణాలోపంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి సమస్యగా మారింది.
- రేషన్ సరుకులు అందించేందుకు ఎండీయూ వాహనాలు సైతం రాని పరిస్థితి.
- పారిశుధ్య పనులు చేసే సిబ్బంది కూడా నిత్యం రాకపోవడంతో టిడ్కో ప్రాంగణాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది.
- టిడ్కో గృహసముదాయాల పరిసరాలు పిచ్చిమొక్కలు పెరిగిపోయి చిట్టడివినితలపిస్తున్నాయి. దోమలు, విషసర్పాలతో ఆందోళన చెందుతున్నారు.
- నాసిరకం విద్యుత్ వైర్లు కారణంగా ఇళ్లలో తరచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గుంటూరులో అయితే వైర్లు కాలిపోయిన ఘటనలు ఉన్నాయి.



పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

దుర్గి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న జరగనున్న నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ళ ఏర్పాట్లను ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీలక్ష్మీ అమ్మవారిని ఎస్పీ శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది ఎస్పీకి స్వాగతం పలికి, అమ్మవారి చిత్ర పటాన్ని అందించారు.

నేడు మున్సిపాలిటీలో ఫిర్యాదుల స్వీకరణ

పాల్గొననున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట,మార్చి14(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మునిసిపల్ కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం 11 గంటలకు ప్రజా సమస్యల ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందని ఛైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు శుక్రవారం తెలిపారు. శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కార్యక్రమంలో పాల్గొని స్వయంగా సమస్యలను పరిశీలిస్తారని వారు తెలిపారు. దీనికి ముందు కళామందిర్ సెంటర్ నుంచి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ కూడా జరుగుతుందని వారు పేర్కొన్నారు.

16న వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

నరసరావుపేట టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పట్టణం రావిపాడు రోడ్డులో ఉన్న వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న మెగా జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ 2021 నుంచి 2025 పాస్ ఆవుట్ విద్యార్థులందరూ అర్హులన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, కాగ్నిజెంట్, సదర్లాండ్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా, హెటిరో, మెడ్ ప్లస్, ఎల్‌అండ్‌టీ మొత్తం 20 కంపెనీలలో 3 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు.

సాగుకు.. యంత్ర సాయం

- రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు
- జిల్లాకు రూ.2.80 కోట్లు.. 1715 పరికరాలు పంపిణీ

(పెదకూరపాడు, ఆంధ్రజ్యోతి)

సేద్యానికి సాంకేతిక సహకారం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రైతులకు రాయతీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు నిధులు విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియను కూడా మొదలుపెడుతున్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. త్వరలోనే యంత్ర పరిక రాలను రైతులకు అందించడానికి అన్ని చర్య లు తీసుకుంటున్నామని, అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా, పారద ర్శకంగా ఈ పథకాన్ని అందించాలని ప్రభుత్వం ఆదే శించింది. రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరిక రాలను అందించే ప్రక్రియను గత వైసీపీ పాలకులు అస్తవ్యస్తం చేయగా ప్రస్తుత ప్రభుత్వం రైతులకు మేలు జరిగేలా మార్గ దర్శకాలను రూపొందించింది.



నిధుల కేటాయింపు ఇలా...

జిల్లాకు రూ.2.80 కోట్లను ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ నిధులతో 1715 పరికాలను రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. రాయితీపై అందిం చే పనిముట్లలో ట్రాక్టర్, డ్రోన్ ఇంప్లిమెంట్స్, స్ప్రేయర్లకే ప్రభుత్వం పెద్ద పీట వేసింది. రైతులకు ఇచ్చే పనిముట్లలో రోటావేటర్లు, వపర్ వీడర్లు ఇతరత్రా కూడా ఉన్నాయి. పరికరాలు కావాలనుకునే రైతులు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని ఆయా మండలాల పరిధిలోని వ్యవసాయ సిబ్బంది ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేసి, క్షేత్ర స్థాయిలో దరఖాస్తు చేసుకున్న రైతుల అర్హతల పై వివరాలు సేకరించి అర్హుల జాబితాను రూపొం దిస్తారు. ఆ జాబితాను జిల్లా స్థాయిలో నివేదించి తర్వాత తుది ప్రక్రియ దిశగా అడుగులేయనున్నా రు. ఈ మొత్తం ప్రక్రియను రెండు వారాల్లోగానే పూర్తి చేసి లబ్ధిదారులకు పరికరాలు అందించాలనే లక్ష్యంతో అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

లక్షలు వెచ్చించారు...లక్ష్యం మరిచారు

నిరుపయోగంగా గోదాములు

సత్తెనపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజక వర్గంలోని ముప్పాళ్ళ మండలంలో, సత్తెనపల్లి మండలంలో నాబార్డు ఆర్థిక సహకారంతో నిర్మించిన గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. రైతులు పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవటానికి వీలుగా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు, ముప్పాళ్ళ మండలం లంకెలకూరపాడు, గోళ్ళపాడు, మాదల, ముప్పాళ్ళ గ్రామాల్లో ఐదు వందలు, వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను నిర్మించారు. అప్పటి వైసీపీ పెద్దల ఆదేశాల మేరకు నిర్మాణాలు జరిగాయి. ఐదు వందల మెట్రిక్ టన్నుల గోదాము నిర్మాణానికి రూ 42 లక్షలు, వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి రూ 70 లక్షలు వెచ్చించారు. లక్కరాజుగార్లపాడులో గోదాము రూ 38 లక్షలు, మాదలలో గోదాము రూ 38 లక్షలతో నిర్మించారు. దశల వారీగా నిర్మాణాలు పూర్తి చేయటంతో సంబంధిత అధికారులు చక చక బిల్లులు చేశారు. నాబార్డు ద్వారా సొసైటీలకు ఇష్టం లేక పోయినా ఈ గోదాముల నిర్మాణాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటిని అద్దెకు ఇస్తామంటే ఎవ్వరూ ముందుకు కూడా రావటం లేదు. అవి ఆయా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. గోడౌన్‌ల నిర్మాణం పూర్తి చేసి ఏడాది కావస్తున్నా వీటిని సహకార శాఖకు స్వాధీనంచేయటంలో మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మాదల, గోళ్ళపాడు గోదాములను సహకార సంఘాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన గోదాములను స్వాధీనం చేసుకోలేదు. గోదాముల నిర్మాణం సహకార సంఘాలకు ఆర్థిక భారం కలిగిస్తుంది. గోదాముల నిర్మాణం పూర్తయిన వెంటనే ఉపయోగంలోకి వస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయంతో సొసైటీలకు వెసులుబాటు కలిగేది. నాబార్డు ద్వారా ఆప్కాబ్‌కు, ఆప్కాబ్ నుంచి సహకార బ్యాంక్‌లకు, అక్కడి నుంచి స్థానిక సహకార సంఘాలకు రుణాలు చెల్లిస్తున్నారు. సహకార సంఘాలు తీసుకున్న రుణాలకు నాలుగు శాతం వడ్డీతో కలిపి తిరిగి బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంక్ అప్పు ఇచ్చిన నాటి నుంచే వడ్డీ కట్టించుకుంటారు. ఐతే గోదాములు వినియోగంలోకి రాక పోవటంతో సహకార సంఘాల పై భారం పడుతున్నది. సంబంధిత అధికారులు వీటిని వినియోగంలోకి తెచ్చేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



లంకెలకూరపాడులో నిర్మించిన గోదాము



ముప్పాళ్ళలో నిర్మాణం పూర్తి చేసుకున్న గోదాము



నోటిసులు తొలగించి నిర్మాణాలు కొనసాగిస్తున్న కబ్జాదారులు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.23 (శనివారం)
సహరి : 4.59 (ఆదివారం)

సామాజిక స్థలం.. కబ్జా

పట్టించుకోని అధికారులు

అల్లూరివారి పాలెం (నరసరావుపేట టౌన్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం అల్లూరివారి పాలెంలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాల ఆక్రమణలు నివారించడంలో అధికారులు విఫలం అయ్యారు. అల్లూరివారిపాలెంలోని ఎస్టీ కాలనీలో 1975లో పేదల కోసం 79 ప్లాటులు ఇచ్చారు. అప్పుడు ఆ కాలనీలో 30 సెంట్లు భూమి సామాజిక అవసరాల కోసం కేటాయించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సమీప గ్రామం కావడంతో భూములు విలువ పెరగడంతో వాటిపై అక్రమార్కుల కన్ను పడింది. సుమారు రూ 2 కోట్లు విలువైన భూమిని ఆక్రమిస్తున్నా అధికారులు ఉత్తిత్తి చర్యలతో సరిపెడుతున్నారు, మొదట ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా, ఆ వ్యవహారంతో రెవెన్యూ అధికారులకు సంబంధం లేదని, ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని ఒకరి మీద ఒకరు చెప్పుకొని తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు పంచా యతీ కార్యదర్శి అక్రమ కట్టడాలకు నోటీసులు అంటించి చేతులు దులుపుకున్నారు. అయి నా అక్కడ నిర్మాణాలు కొనసాగు తూనే ఉన్నాయి. అయినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో విలువైన కాలనీ భూమి కబ్జా దారుల కోరలలో బంధి అవుతుందని, తగిన చర్యలు తీసుకుని భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆక్రమించి నిర్మిస్తున్న షెడ్‌కు నోటిసులు అంటిస్తున్న వీఆర్‌ఏ నాసర్



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం



మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..


మొక్కు తీరుద్దామని..



పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

చిత్రాడదారులన్నీ జనపవనమై..





జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

పింఛన్ల బదిలీకి ఛాన్స్!

● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల బదిలీకి అవకాశమిచ్చిన ప్రభుత్వం

● సచివాలయాల్లో బదిలీ దరఖాస్తు చేసుకునే సదుపాయం

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. వలంటీర్లు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులే ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించడంతో మొదలైన ఈ సంస్కరణల ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రతినెలా ఏదో ఒక సంస్కరణతో పింఛనుదారుల్లో భరోసాపెంచేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తాజాగా పింఛన్లను తమకు నచ్చినచోటికి మార్చుకునేలా అవకాశం కల్పించింది. దీంతో ఈ అవకాశంకోసం ఎదురుచూస్తున్న ఎంతోమంది పింఛనుదారులకు ఊరట లభించినట్లయింది.

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 7లక్షల 53వేల 830మంది పింఛన్లు పొందుతున్నారు. వారిలో చాలామంది గతంలో తాము ఉన్న ప్రాంతాల్లో ప్ర స్తుతం నివసించడం లేదు. వయోవృద్ధులు బిడ్డల పై ఆధారపడి వేరేచోటకి వెళ్లిపోవడం, చూసేవా రులేక ఆశ్రమాల్లో ఆశ్రయం పొందడం, ఒంటరి మహిళలు, వితంతువులు బతుకుదెరువు కోసం ఒకచోటి నుంచి మరోచోటికి వెళ్లాల్సిరావడం వంటి పలు కారణాలతో వేరే ప్రాంతాలకు వెళ్లినవారు చె ప్పుకోదగిన సంఖ్యలోనే ఉన్నారు. వీరంతా పింఛన్ల ను బదిలీ చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. సమీపంలోని సచివాలయాలకు వెళ్లి నిరాశగా వెను తిరుగుతున్నారు. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో ఇప్పటి వరకూ ఫ్రీజింగ్‌లో ఉన్న పింఛన్ బదిలీ ఆప్షన్ అనేబుల్ చేసింది. దీంతో పింఛన్ల బదిలీకి అవకాశం లభించింది. పింఛన్ల బదిలీ కోరుకునే లబ్దిదారులు ప్రస్తుతం వారు నివసిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ల బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెలాఖరు నాటికీ ఈ ప్రక్రియను పూర్తిచేసుకుంటే ఏ ప్రిల్ 1నుంచి లబ్దిదారులు ఉండేచోటికే పింఛన్లు తెచ్చి అందిస్తారు.

కొత్త పింఛన్లపై నిరాశే..

కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛను మొత్తం పెరగడంతో అనేక మంది కొత్తగా పింఛన్లు పెట్టుకోవాలని భావిస్తున్నారు. గత వైసీపీ సర్కారు కక్షాపూరిత రాజకీయాల వల్ల కూడా అనేకమంది పింఛనుదారులు అనర్హత బారిన పడ్డారు. వారంతా గత ఎనిమిది నెలలుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొత్త పింఛన్లకు అవకాశం కల్పించాలని అలాంటివారంతా ప్రజాప్రతినిధుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి ఎమ్మెల్యేకి వచ్చే విజ్ఞప్తుల్లో 70 శాతం పింఛనుకు సంబంధించిన విజ్ఞప్తులే ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతా వారంతా తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

పిన్నెల్లిపై.. చర్చకు సిద్ధమా..?

● జగన్మోహనరెడ్డికి యరపతినేని పిలుపు



పిడుగురాళ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గురజాల నియోజకవర్గంలోని పిన్నెల్లి, మోర్జంపాడుతో పాటు పలుగ్రామాలలో టీడీపీ శ్రేణులపై దాడులు, అక్రమ కేసులు, ఆస్తుల ధ్వంసంపై పిన్నెల్లి గ్రామం వేదికగా చర్చకు రావాలని పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆహ్వానించారు. గత ఐదేళ్ల అనేక గ్రామాలలో అరాచకాలకు పాల్పడి మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టిన వైసీపీ నేతలు కొందరు జగన్‌ను కలిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాపై దాడులు జరుగుతున్నాయని, ఊర్ల నుండి వెలివేస్తున్నారని చెప్పడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని యరపతినేని పేర్కొన్నారు. జగన్‌కు వైసీపీ నేతలు చెప్పిన మాటల్లో వాస్తవం లేదని, అన్నివిషయాలు వెలుగులోకి రావాలంటే జగనే పిన్నెల్లికి రావాలని యరపతినేని పిలుపునిచ్చారు. జగన్ ఎప్పుడు వచ్చినా చర్చకు సిద్ధంగా ఉన్నానని, జగన్ హాజరై ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన అకృత్యాలు, అక్రమాలపై అక్కడే సమాధానం చెప్పాలని యరపతినేని డిమాండ్ చేశారు. 2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు ఒక్క వైసీపీ కార్యకర్త కూడా గురజాల నియోజకవర్గంలో చనిపోలేదని, 2019-24 మధ్య వైసీపీ అధికారంలో వుండగా 11 మంది తెలుగుదేశం కార్యకర్తలు హత్యకు గురికావడమే కాకుండా వైసీపీ నేతలు అక్రమమైనింగ్ చేస్తున్న గుంతల్లో పడి 8 మంది చిన్నారులు మృతి చెందిన విషయమే కాకుండా వైసీపీ నేతలు మహిళలపైచేసిన అత్యాచారాలు, ఆక్రమించుకున్న భూములతో బ్యాంక్‌ల రుణాలు, విచ్చలవిడిగా గ్రామాలలో తెలంగాణ మద్యం అమ్మకాలు, పిన్నెల్లి, తంగెడ గ్రామాలలో నాటు బాంబుల తయారీ విషయాలపై జగన్‌తో చర్చావేదిక జరిపేందుకు సిద్ధంగా వున్నానని, వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాల విషయాలను బయట ప్రపంచానికి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కృష్ణానది గర్భాన్ని కూడా వదలకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడటమే కాకుండా తుమ్మలచెరువు, పెదగార్లపాడు, గుత్తికొండలో మైనర్ బాలికలపై అఘాయిత్యాలు, పిడుగురాళ్లలో బీసీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యం, తుమ్మలచెరువు సైదాపై జరిపిన దాడిపై చర్చకు జగన్ సిద్దమేనా అని ప్రశ్నించారు. జగన్ పిన్నెల్లి ఎప్పుడు వచ్చినా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన నిర్వాకం, అక్రమాలు చర్చా వేదికలో బయటపెడతామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దాడులను ప్రోత్సహించలేదని, నాయకులను, కార్యకర్తలను కూడా సంయమనం పాటించాలని సూచించడం జరిగిందన్నారు.త్వరలో పిన్నెల్లిలోని అఘాయిత్యాలపై విచారణ జరిపిస్తామన్నారు. ఎన్నికల రోజున తంగెడ, పిన్నెల్లిలో బాంబుల ఘటనపై కూడా విచారణ జరిపేలా చూస్తామని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

గుండెపోటుతో జర్మనీలో గణపవరం యువకుడు మృతి



అశోక్‌చంద్రకుమార్ (ఫైల్‌ఫోటో)

నాదెండ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన కాట్రు అశోక్‌చంద్ర కుమార్ (46) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జర్మనీ దేశంలో గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వెంకట చలపతిరావు కుమారుడైన అశోక్‌చంద్ర కుమార్ లండన్‌లో మైక్రోబయాలజీలో పీజీ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పొన్నూరు సమీపంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన శిరీషను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కంపెనీ తరపున కొద్దికాలం క్రితం జర్మనీ వెళ్ళిన ఆయన ఈనెల 7వ తేదీన ఉద్యోగానికి వెళ్తుండగా కార్డియాక్ అరెస్టుకు గురయ్యాడు. స్నేహితులు అతన్ని ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహం శనివారం ఉదయానికి గణపవరం రానున్నది. ఆయన మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

గుంటూరు కెనాల్‌లో కాలు జారిపడి విద్యార్థి మృతి



దాసరి జాషువా (ఫైల్‌ఫోటో)

పెదకాకాని, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలుజారి గుంటూరు చానల్‌లో పడి విద్యార్థి మృతిచెందిన సంఘటన శుక్రవారం నంబూరులో జరిగింది. అదే గ్రామానికి చెందిన దాసరి జాషువా(13) స్థానిక జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. హోలీ పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి రంగులు పూసుకొని ఆటలాడారు. ఒంటిపై రంగును కడుక్కునేందుకు స్నేహితులతో కలిసి గుంటూరు చానల్ వద్దకు వచ్చాడు. రంగులు కడుక్కుంటున్న క్రమంలో కాలుజారి చానల్‌లో పడిపోయాడు. వెంటనే పక్కనున్న పిల్లలు స్థానికులకు సమాచారం ఇవ్వగా గుంటూరు చానల్ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

16, 17 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈ నెల 16, 17 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 08579 విశాఖపట్టణం-చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6.20కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు 08580 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా రాత్రి 10 గంటలకు విశాఖపట్టణం చేరు కొంటుందన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శుక్రవారం నాటికి 520.30 అడుగులు ఉంది. ఇది 149.82 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,761 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

గుండెపోటుతో రైతు మృతి

కారంపూడి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన రైతు బొజ్జ వెంకటేశ్వర్లు (69) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామ శివారులోని నాలుగు ఎకరాల భూమిని గత మూడు తరాలుగా సాగు చేస్తున్నారు. ఇటీవల ఆ భూమిలో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారు. వందల యేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలో ప్రభుత్వ అధికారులు బోర్డు పెట్టడంతో గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. తాము సాగు చేసుకుంటున్న భూమికి తమకే పట్టాలివ్వాలంటూ వినతిపత్రం అందించారు. ఇంతలో కొందరు ఆ భూమిని దేవదాయ శాఖలో కలుపుకోవాలని అధికార యంత్రాంగానికి సిఫార్సులు అందిస్తున్నారు. గ్రామంలో రాజకీయ ఒత్తిడి పెరిగిపోతోంది. తరతరాల నుంచి వస్తున్న సాగుభూమి పోతుందేమోనని, జీవనం కష్టతరమవుతుందనే ఆలోచనతో గత నాలుగు రోజుల నుంచి దిగులుతో ఉన్న వెంకటేశ్వర్లు గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు వెంకటేశ్వర్లుకు నలుగురు సంతానం ఉన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 29.97 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు వందల క్యూసెక్కుల నీరు లీకుల ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

జోన్ డైరీ

● మాచర్ల పట్టణంలోని మాచర్ల ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం బత్తుల వీరాస్వామి తెలిపారు. ప్రయాణికులు బస్సుల విషయంలో సమస్యలు, సూచనలను సెల్: 9959225432 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం వీరాస్వామి కోరారు.

● సత్తెనపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

● రెంటచింతల మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సరోజనిదేవి తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా సమావేశానికి రావాలని ఆమె కోరారు.

● మాచర్ల నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యాన ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేయనున్నారు. ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రజలు అర్జీతో పాటు ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబరు తప్పనిసరిగా జతచేయాలి.

● దుర్గి మండలంలోని కోలగుట్లలో శనివారం విజయవాడకు చెందిన హెల్ప్ హాస్పిటల్ ఆధ్వర్యాన గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నారు. బీపీ, ఈసీజీ, గుండె స్కానింగ్ పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేయనున్నారు. రూ. 12,500 విలువైన అంజియోగ్రా టెస్టును డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా అందించనున్నారు.

పన్నుల వసూళ్లలో అలసత్వం

● అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వం ఆగ్రహం
● మొండి బకాయిల జాబితా ప్రకటించాలి
● పన్ను చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ కట్
● మొండి బకాయిదారులపై తక్షణ చర్యలు
● ప్రత్యేక డ్రైవ్‌కు కమిషనర్ ఆదేశం


పురపాలక సంఘ కార్యాలయం


కమిషనర్ ఆనంద్ కుమార్

సత్తెనపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పురపాలక సంఘంలో పన్ను వసూళ్లల్లో వెనుకబాటుతనం స్పష్టంగా కన్పిస్తుంది. పురపాలక సంఘంలో మొత్తం రూ.6,54,98,000 ఆస్తిపన్ను వసూలుకు గాను శుక్రవారానికి రూ.3,45,61,000 మాత్రమే నేటికి వసూలైంది. నీటి పన్ను రూ.2,43,57,000లకు గాను రూ.51 లక్షలు, ఖాళీ స్థలాల పన్ను రూ.51.63 లక్షలకు గాను రూ 16.04 లక్షలు వసూలైంది. పన్ను వసూళ్ళ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగటంతో ఈనెల 20వ తేదీ నుంచి ఆస్థి పన్ను చెల్లించని వారి కుళాయి కనెక్షన్‌లను తొలగిస్తామని మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ తెలిపారు. మొండి బకాయి దారుల గృహాలకు పన్ను వసూళ్ళ నిమిత్తం మునిసిపల్ రెవెన్యూ అధికారులు వెళ్ళిన సమయంలో స్పందన రాకపోతే వెంటనే కుళాయి కనెక్షన్ కట్ చేస్తామ న్నారు. పూర్తి మొత్తం పన్ను చెల్లించిన తరువాత కనెక్షన్ పునరుద్ధరిస్తామన్నారు. పురపాలక సంఘానికి ఆర్థిక సంఘం నిధులు రావాలంటే నూరు శాతం పన్ను వసూలు చేయాలని రాష్ట్ర స్థాయి ఉన్నతాధి కారులు తెలిపారన్నారు. పన్ను వసూళ్ళపై సచివాలయ సిబ్బందితో, మునిసిపల్ రెవెన్యూ సిబ్బందితో ప్రతి రోజు సమీక్ష చేస్తున్నామ న్నారు. ఎక్కువ మొత్తం బకాయి పడిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పన్నులు చెల్లించిన వారి పేర్లతో జాబితాను సిద్ధం చేసి ప్రధాన కూడలిలో ప్రదర్శిస్తామన్నారు. సచివాలయాల వారీగా డిఫాల్టర్ల జాబితా తయారు చేసి ప్రకటిస్తామన్నారు. బకాయిదారులు తక్షణమే పన్ను చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, మార్చి14(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికార తకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తిహక్కు కల్పించారని, దానికి కొనసాగింపుగా చంద్ర బాబునాయుడు మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టా రన్నారు. మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలు, ఇంటి నిర్మాణం, భూమి కొనుగోలు వంటి ఎన్నో పథకాలను ఆచరణాత్మకంగా అమలుచేశారన్నారు. 2025-26 బడ్జెట్‌లో మహిళా శిశు సంక్షేమశాఖకు రూ.4332 కోట్లు కేటాయించారని యరపతినేని తెలి పారు. వైసీపీ హయాంలో బడ్జెట్‌లో మహిళలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్‌కు మహిళలను అక్కా చెల్లి అనే అర్హత లేదన్నారు. ఉచితంగా ఇల్లు ఇస్తానని నమ్మించి మాటతప్పి ఓటిఎస్ పేరుతో ఒక్కో మహిళ నుండి 10 నుండి 30 వేల రూపాయలు వసూలు చేశాడని, సెంటు పట్టా పేరుతో మహిళలను మోసం చేసి టిడ్కో గృహాలు ఇవ్వకుండా పాడుపెట్టారన్నారు. అంగన్‌వాడీలకు జీతాలు రూ. 6,300 పెంచగా, జగన్ రూ.వెయ్యి మాత్రమే పెంచా డని, జాతీయ స్థాయిలో మహిళలపై నేరాల రేటు 66.4 శాతం వుంటే ఏపీలో జగన్ పాలనలో 96.2 శాతం నమోదు కావడం చూస్తే మహిళల భద్రతలో జగన్‌రెడ్డి వైఫల్యం కనిపిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తెచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సున్నా వడ్డీ రుణాల పరిమితి సీఎం రూ.5 లక్షలకు పెంచారని, డ్వాక్రా లోని ఎస్సీ ఎస్టీ మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఒక్కో సభ్యురాలికి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలు, ఆశ కార్యక ర్తలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న గ్రాట్యూటి చెల్లింపులకు శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు.

గోలివాగు ముప్పు తప్పింది

● వంతెన పూర్తవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు
● గతంలో 10 మంది జలసమాధి


గోలి వాగుపైనిర్మితమైన హైలెవల్ బ్రిడ్జి

రెంటచింతల,మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మాచర్ల గుంటూరు ప్రధాన రహదారిపై రెంటచింతల శ్రీరామ కృష్ణా గురుకులం సమీపంలోని గోలివాగుపై వంతెన నిర్మాణం పూర్తికావడంతో ముప్పు తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీవర్షాలు కురిసిన ప్పుడల్లా వాగు పొంగడం గంటల తరబడి ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడం పరిపాటిగా ఉండేది. 2000 సంవత్సరం ఆగస్టు 24న భారీ వర్షానికి వాగు పొంగింది. ఆ సమయంలో గురజాలకుచెందిన సుమో వాహనంప్రయాణీకులతో బ్రిడ్జినిదాటే క్రమంలో వరద ఉధృతికి కొట్టుకుపోంది. అప్పుడు సుమోలోని 10 మంది జలసమాధయ్యారు. ఇప్పుడు వంతెన పూర్త వడంతో నాటి విషాద ఘటనను ప్రజలు గుర్తుచేసుకుంటూ ఇక ఏ ప్రమాదం ఉండదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 167 ఏడీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రూ.1.80 కోట్లతో 90 మీటర్ల పొడవు, 18 మీటర్ల వెడల్పు, 5 కానాలతో, 25 గడ్డర్లతో వంతెనను నిర్మించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, హైవే ఈఈ సంజీవరాయుడు, డీఈ శ్రీనివాసరావు పీడీ శ్రీకాంత్‌రెడ్డితో పలుమార్లుచర్చలు జరిపి వంతెన నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా కృషి చేయడంతో ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్లటౌన్, మార్చి14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయ సమీపాల్లో శనివారం విద్యుత్ స్తంభాలు మార్చుతుండడంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశానికి

ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష

మాచర్లరూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థలో ప్రవేశాలకు ఏప్రిల్ 25న నరసరావుపేటలో ప్రవేశ పరీక్ష ఉంటుందని విజయపురిసౌత్ గురుకుల జూనియర్ కళాశాల హెచ్ఎం సరోజిని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్, గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు కోరే విద్యార్థులు ఆయా పరీక్షకు హాజరు కావాలని కోరారు.

రామప్ప దేవాలయంలో పూజలు

మాచర్లటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామప్ప దేవాలయంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు సారె తీసుకొని మేళతాళాలతో పట్టణ వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కంభంపాటి యలమంద, పోలిశెట్టి చంద్రశేఖర్, షరాబు వెంకటరత్నం, తుమ్మేపల్లి సత్యనారాయణ, అంకేశ్వరరావు, మంజుల, కొత్త సుబ్రహ్మణ్య, కుమారి, శివపార్వతి, శ్రీలత, ప్రమీలా, ఉషారాణి, అనూష, అరుణ, ధనలక్ష్మి, సుధ, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

మాచవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగరాయపాలెం తండా గ్రామ శివారులోని కొండపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పుణ్య దంపతులు పీటల మీద కూర్చొని కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్పూరపు ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేష్ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్థులు ప్రభలు, ఎడ్లబండ్లు కట్టుకొని దేవాలయం వద్దకు చేరుకొని పొంగళ్ళు నైవేద్యంగా స్వామివారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కోలాటాలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లుట్ల, సింగరాయపాలెం తండా గ్రామస్థులు కలసి భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అన్నదానసత్రం అధ్యక్షుడిగా అంజిరెడ్డి

రెంటచింతల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం సత్రశాలలోని భక్త మల్లారెడ్డి అన్నదాన సత్రం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొట్టం అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గాదె వీరారెడ్డి, కార్యదర్శిగా మందలపు వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శిగా చపారపు విజభాస్కరరెడ్డి, కోశాధికారిగా నెమలి సీతారామిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి పదవీ కాలం 2 సంవత్సరాలు ఉంటుంది. ఇప్పటి వరకు సత్రం అభివృద్ధికి కృషి చేసిన పాత పాలకవర్గానికి నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చెంచయ్య మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరి చెంచయ్య మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ బెల్లంకొండ మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి అన్నారు. శుక్రవారం మృతుడు చెంచయ్య మృతదేహం ఆయన వద్ద నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు నగదును కుటుంబసభ్యులకు అందజేసి వారిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బద్దూరి వీరారెడ్డి, బందూరి వెంకట కృష్ణారెడ్డి, బద్దూరి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ చావలి ఎరుకలయ్య, గోవిందరెడ్డి, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనే ముఖ్యం

రెంటచింతల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జీవితంలో విజేతగా నిలవాలంటే జ్ఞాన సముపార్జనతోనే సాధ్యపడుతుందని గురజాల ఏఎస్‌డబ్ల్యువో టీవీ సుజాత అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహాల్లో పదో తరగతి పరీక్షలు రాయబోయే 110 మంది బాల బాలికలతో ప్రత్యేకంగా సమావేశమై పరీక్షలు గురించి పలు సూచనలు చేశారు. నేటి ఆధునిక డిజిటల్ యుగంలో ఎదిగేందుకు గల విస్తృత అవకాశాలను వివరించారు. ఎస్‌బీఐ మేనేజర్ ఆంజనేయులు నాయక్ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేయగా, పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన మారుతి నాగార్జున, సత్యవతిలు రిస్ట్ వాచ్‌లను అందచేశారు. కార్యక్రమంలో వార్డెన్లు జె.అరుణకుమారి,నూరుల్లాబేగ్,గోపాల్ నాయక్,మాధవి లత,శిరోమణి,రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర సభలు

మాచవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారం మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పై గ్రామ సభలను శనివారం నిర్వహించాలని ఎంపీడీవో వెంగళరావు శుక్రవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, అంగన్ వాడీలు, ఏఎన్‌ఎంలు, పాల్గొనే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

పిడుగురాళ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని కెఎస్‌ఆర్ విద్యాసంస్థలు కొండమోడులోని పిఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎంసెట్ విద్యా ర్థులకు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. పూర్తి సమాచారం కోసం 9866249110, 9030 562102 నెంబర్లను సంప్రదించాలని కోరారు. మార్చి 24 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

పెదకూరపాడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ఈతకు వెళ్ళి బాలుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని ముస్సాపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన పాటిబండ్ల శ్రీనివాసరావు, నిర్మల దంపతులకు కుమార్తె, కుమా రుడు ఉన్నారు. కుమారుడు మహిధర్(12) మరో ముగ్గురు పిల్లలతో కలసి సమీపంలోని పెద వాగు వద్దకు మధ్యాహ్న సమయంలో ఈతకు వెళ్ళారు. మొదటగా పెదవాగులో లోతు ఎక్కువగా ఉండటంతో నలుగురు నీటిలో మునగగా ఒక బాలుడు నీటిలో నుంచి బయటకు వచ్చాడు. మరో ఇద్దరిని స్థానికులు రక్షించగా, మహిధర్ గల్లంతయ్యాడు. అనంతరం పలువురు వాగులో దిగి వెతకగా బాలుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి నట్టు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గంగమ్మ అమ్మవారి తిరునాళ్ల

అచ్చంపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అచ్చంపేటలోని సీతారామపురంలో శుక్ర వారం నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారి ఆలయం వద్ద ఉదయం 6:30 గంటలకు నిత్య విధి మండప దేవత పూజలు, ఉత్తరా నక్షత్ర యుక్త మేష లగ్న పుష్కరాంశం నందు అమ్మవారి మూర్తి ప్రతిష్ఠ, గో ప్రతిష్ఠాకార్యక్రమాలు జరిగాయి. రుద్ర హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి నట్టు ఆలయ ధర్మకర్త పెద్ది చిన యలమందరావు తెలిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న ప్రసాద కార్యక్రమాలు జరిగాయి. రాత్రి సంకీర్తన సేవా కార్యక్రమాలు, కుంకుమ బండి ఊరేగింపు జరిగింది. మండలంలోని ఓర్వకల్లు గ్రామంలో శ్రీ గంగాదేవి పేరంటాళ్ళ అమ్మవారి దేవస్థానంలో నెల తిరునాళ్ళ మహోత్సవం నిర్వహించారు.

వెన్నా వీరారెడ్డి మృతి బాధాకరం

బెల్లంకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి సోదరుడు వెన్నా వీరారెడ్డి(75) మృతి ఎంతో బాధాకరమని జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ పెదకూరపాడు బుజ్జి అన్నారు. నాలుగు రోజుల నుంచి ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున వీరారెడ్డి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బుజ్జి వీరారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు టీడీపీ నేతలు లేమల్లెవలి, అన్నంగి శ్రీను, వెంకటరామిరెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారు.

మంటల్లో కాలిన వ్యక్తి

చికిత్స పొందుతూ మృతి

రెంటచింతల,మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంటల్లో కాలిపోయిన వ్యక్తి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మండలంలోని తుమ్మకోట గ్రామంలోని సుగాలి కాలనికి చెందిన బాణావత్ బిక్రునాయక్(35), మజ్జినాయక్ అన్నదమ్ములు. వీరిద్దరు పక్క పక్కన ఇళ్ళలో నివసిస్తున్నారు. 20 సంవత్సరాల క్రితం జయతో బిక్రునాయక్‌కు వివాహం కాగా 19 ఏళ్ల కుమారుడు ప్రసాద్ నాయక్ వున్నాడు. బిక్రునాయక్, జయ కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. తమ్ముడు మజ్జినాయక్ అన్న బిక్రునాయక్ బాగోగులను చూస్తున్నాడు. 9వ తేదీ రాత్రి బాగా మద్యం తాగిన బిక్రునాయక్ కట్టెల పొయ్యి మంటల్లో పడ్డాడు. తీవ్రగాయాలైన బిక్రునాయక్‌ను తొలుత గురజాల ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. అయితే ఈ ఘటనపై గుంటూరు ఆసుపత్రి నుంచి ఇంకా సమాచారం రాలేదని ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. కాగా తన భర్త మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు భార్య జయ ఆరోపించారు.

అద్దె భవనాల్లోనే సచివాలయాలు..


అద్దె భవనాల్లో గ్రామ సచివాలయాలు

● నూతన భవనాలు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పాత వాటిల్లోనే కార్యకలాపాలు ..
● ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న వైనం
● పట్టించుకోని ఉన్నతాధికారులు

పెదకూరపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాధనం అంటే పట్టింపు లేనట్లుగా పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్నారు. నియోజక వర్గ కేంద్ర మైన పెదకూరపాడులో సుమారు రూ 80 లక్షల వ్యయంతో రెండు సచివాలయాలను వైసీపీ ప్రభుత్వంలో నిర్మించారు. గత ఏడాది ఫిబ్రవరి 29న అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సచివాలయాలను ప్రారంభించారు. ఇవి ప్రారంభించి ఏడాది దాటినా ఎటువంటి సౌకర్యాలు లేని అద్దె భవనాల్లోనే అధికారులు కొనసాగిస్తున్నారు.

పెదకూరపాడులో మూడు గ్రామ సచివాలయాలు ఉండగా ఒక సచివాలయాన్ని పంచాయతీ భవనంలో కొనసాగిస్తున్నారు. రెండు, మూడు సచివాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఒక సచివాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరో సచివాలయాన్ని నూతనంగా నిర్మించారు. ఆయా భవనాలను ప్రారంభించినా కాంట్రాక్టర్ల నుంచి అధికారులు నేటికి స్వాధీనం చేసుకోక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. నూతనంగా నిర్మించిన సచివాలయాలను ఉపయోగించుకోకుండా అద్దెలు చెల్లించి పాత భవనాల్లోనే కార్యకలాపాలు నిర్వహించడానికి అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని మోపుతూ, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుండటంపై స్థానిక ప్రజల బాహాటం గానే విమర్శలు గుప్పిస్తున్నారు. సచివాలయాలకు నెల వారీగా అద్దె, కరెంటు బిల్లులు, స్టేషనరీ తదితర ఖర్చులు, గ్రామ పంచాయతీల పై ఆర్థిక భారం పడుతుంది. కాగా మండలంలోని పలుగ్రామాల్లోనూ అద్దె భవ నాల్లోనే సచివాలయాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సచివాలయాలను పక్కా భవనాల్లోకి తరలించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఆర్టీసీ బస్టాండ్, ఎంపీడీవో కార్యాలయంలో ముందు నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు

వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎంపీ, ఎమ్మెల్యే..



తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకు న్నారు. పల్నాడు ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో జీవించాలని దేవుడిని కోరినట్లు ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు. వీరి వెంట యరపతినేని నిఖిల్ వున్నారు. - **పిడుగురాళ్ల**

వేసవిలో నీటి ఎద్దడిపై ప్రణాళిక

● మండల పరిషత్ సమావేశంలో ఎంపీడీవో రామచంద్రరావు

పిడుగురాళ్ళ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో నీటి ఎద్దడి నివారణకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో స్వచ్ఛత పాటించాలని, పాఠశాలల్లో విద్య, మధ్యాహ్న భోజన పథకంతో పాటు అన్ని పథకాల అమలుపై అధికారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు. సమావేశంలో ఎంపీపీ గార్లపాటి అనసూర్య, సూపరింటెండెంట్ ఎం.నాగచంద్రకుమారి, ఈవోపీఆర్డీ దయాసాగర్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న క్యాలీగ్రఫీ నిపుణులు

చేతి రాత తలరాతను మారుస్తుంది

● జాతీయ అవార్డు గ్రహీత, క్యాలీగ్రఫీ నిపుణుడు రామ్మోహనరావు

క్రోసూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చేతి రాత తల రాతను మారుస్తుందని జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, చేతిరాత నిపుణుడు ముప్పాళ్ళ రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం క్రోసూరు హైస్కూల్లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు క్యాలీగ్రఫీలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతి రాతలో తాము నేర్చుకున్న మెళకువలను ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయోగపడాలన్న సదుద్దేశంతో ఈ శిక్షణను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణలో వివిధ పాఠశాలల నుంచి 50 మంది ఉపాధ్యాయులు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలెమర్రు ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ శరత్ కుమార్ ఆహ్వానం మేరకు ఇక్కడ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో చేతి రాత నిపుణులు సత్యనారాయణ, సదాశివరెడ్డి, నాగమణి, జగదీష్, ప్రియాంక తదితరులు హాజరయ్యారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

దాచేపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నాయకురాలు నాగమ్మచే నిర్మాణమైన పార్వతి దేవి సమేత చెన్న మల్లికార్జునస్వామి వార్ల లింగాకార పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వేద మంత్రాల మధ్య ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి తనయుడు సర్పంచ్ జంగా సురేష్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 8:55 గంటలకు పార్వతిదేవి సమేత చెన్న మల్లికార్జునస్వామి, గణపతి, ద్వార పాలకులు, నందీశ్వరుడు, బలిపీఠం, ఆలయ శిఖర ప్రతిష్ఠా కార్యక్రమాలకు అంకురార్పణ పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

కారంపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హరిహర పుత్ర అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను ప్రతియేడాది పాల్గొన మాసం ఉత్తర నక్షత్రం రోజున శబరిమలలోనిర్వహిస్తుంటారు. ఈ మేరకు మండల కేంద్రమైన కారంపూడిలోని చెన్నకేశవ స్వా మి దేవాలయ ఆవరణలో శుక్రవారం అయ్యప్పస్వామికి 18 రకాల అభిషేకాలను అయ్యప్ప సేవాసంఘం ఆధ్వర్యాన ఘనం గా నిర్వహిచారు. తొలుత గణపతిపూజ, సుబ్రహ్మణ్యస్వామిపూజ జరిపారు. అనంతరం అయ్యప్పస్వామి పడిపూజ జరిపారు. 18 మెట్లపై కర్పూర దీపాలు వెలిగించారు. అయ్యప్పస్వామి భక్తిగీతాలు ఆలపన అలరించింది. కార్యక్రమంలో గురుస్వాములు సింగం బాలకృష్ణ, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, రామకృష్ణ, నాగవరపు ఆంజనేయులు, భాను, అకౌంట్ శ్రీను, దినకర్, పెనుగొండ్ల శ్రీనివాసరావు, ఏకే మనిదీప్, వెచ్చా వరలక్ష్మణరావు, యోగేశ్వరరావు, కొత్త మురళీహరినాథ్, చలవాది మాధవ పాల్గొన్నారు.

ఒప్పిచర్లలో.. మండలంలోని ఒప్పిచర్లలో శుక్రవారం అయ్యప్పస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో బ్రహ్మంగారి గుడి వద్ద ట్రాక్టర్‌పై అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహాన్ని ఉంచి మేళతాళాలతో గ్రామోత్సవం జరిపారు. ప్రసాదం పంపిణీ చేశారు. గురుస్వామి వసంతయ్య, సిద్ధార్థ, బొల్నేడి హరికృష్ణ, అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

● ఉత్సాహంగా పాల్గొన్న సుగాలీలు.. మహిళలు

బెల్లంకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని గ్రామాల్లో శుక్రవారం హోళీ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో సుగాలీలకు చెందిన మహిళలు, యువత గులాంలు చల్లుకున్నారు. అదే విధంగా న్యూ చిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు హనుమంతరావు నాయక్ ఆధ్వర్యంలో హోళీ సంబరాలు నిర్వహించారు. మాచాయపాలెం, వెంకటాయపాలెం, రామాంజనీపురం, మన్నె సుల్తాన్‌పాలెం గ్రామాల్లో సుగాలీలు హోళీ నిర్వహించారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరికపాడు సుగాలీ తండాలో హోళీ వేడుకలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మహిళలు ఉదయం నుంచే దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, సంప్రదాయ దుసుతలు ధరించి రంగులు చల్లుకుంటూ పండుగ శుభా కాంక్షలు చెప్పుకున్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన తండాల్లో హోళీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాడువాయి మాజీ సర్పంచ్ మూడావత్ బాలా నాయక్ ఆధ్వర్యంలో హోళీ వేడుకలు జరిగాయి. మాదిపాడు పంచాయతీలోని కంచుగోడు తండా, జడపల్లి మోటు తండా, గింజుపల్లి తండా, బంగారు తండా, సంద్ర తండా, నీలేశ్వరపాలెం తండా, శ్రీనివాస తండా, కొండూరు తండా తదితర తండాల్లో హోళీ నిర్వహించారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేశ్వరపురం తండా, సింగరాయపాలెం తండా, మోర్జంపాడు, చెన్నాయపాలెం, పిన్నెల్లి తదితర గ్రామాల్లో సుగాలీలు హోళీ వేడుకలను జరుపుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటూ గులాంలు చల్లుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.









విద్యార్థికి పాఠశాల స్థాయిలో అత్యంత కీలకమైన దశ పదవ తరగతి. ఈ పరీక్షల్లో సాధించే మార్కుల ఆధారంగానే భవిష్యత్తులో ఉన్నత విద్యా అవకాశాలకు బీజం పడుతుంది. ఈ నెల 17 నుంచి 31 తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులను గూర్చి జిల్లా విద్యాశాఖ విద్యార్థులకు తగు సూచనలను, సలహాలను అందిస్తోంది..

- భయం వీడితే... సగం విజయం సాధించినట్లే
- సెల్ ఫోన్లు ,టీవీలకు విరామం ఇవ్వండి
- జంక్ ఫుడ్ జోలికి వెళ్లొద్దు.. సాత్విక ఆహారమే మేలు
- పాఠ్యాంశాల నిత్య పునఃచరణ ఎంతో కీలకం
- పది విద్యార్థులకు విద్యాశాఖ సూచనలు

జయమ్ము... నిశ్చయమ్మురా..

గుంటూరు విద్య, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో దాదాపు 80 వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే విద్యాశాఖ వందరోజుల ప్రణాళికతో పాటు ఇటీవల గ్రాండ్ టెస్టులు కూడా నిర్వహించింది. ఇందులో వచ్చిన మార్పులు ఆధారంగా విద్యార్థుల్ని మరింతగా ప్రోత్సహించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఒక ప్రణాళికతో చదివితే పదిలో ఉత్తమ మార్కులు సాధించవచ్చునని డీఈఓ సీవీ రేణుక రేణుక స్పష్టం చేస్తున్నారు.

ఆరోగ్యం... ఆత్మవిశ్వాసం

పరీక్షల సమయంలో విద్యార్థి ఆరోగ్యం పటిష్టంగా ఉండటం ఎంతో ముఖ్యం. కొంతమంది విద్యార్థులు పరీక్షలు అంటేనే తీవ్రమైన ఆందోళనకు గురవుతుంటారు. అటువంటి వారిని గుర్తించి వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇప్పించేలా విద్యాశాఖ ఏర్పాటు చేసింది. మరి కొంతమంది నిద్రాహారాలు మాని పరీక్షలకు సన్నద్ధం అవుతుంటారు . ఇది ఏ మాత్రం సరైన పద్ధతి కాదని మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా పునఃచరణ ఉదయం నాలుగు గంటల నుంచి ప్రారంభించి 6 గంటల వరకు, సాయంత్రం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు ప్రణాళిక ప్రకారం సబ్జెక్టుల వారీగా చేసుకోవాలి. ఏకదాటిన కాకుండా కనీసం గంటకు ఒకసారి మధ్య మధ్యలో కొంత విరామం ఇస్తూ చదువుకోవాలి. రోజుకు కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్ర అవసరం.

ఆహారం విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలి. జంక్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్, మాంసాహారం జోలికి పరీక్షలు పూర్తి అయ్యేవరకు వెళ్లకపోవడం ఉత్తమం. కొబ్బరి నీళ్ల ,మజ్జిగ, గ్లూకోజ్, వేసవి లో లభించే చెరుకు రసం, బత్తాయి రసం, పుచ్చకాయలు వంటి పండ్ల రసాలు, పానీయాలు తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారి నుంచి తప్పించుకోవచ్చు.

వీటిని దూరం పెట్టండి....

- విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్లు టీవీల్లో వచ్చే క్రికెట్, సినిమాలు, సీరియల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి.
- సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలి .
- ఏకాగ్రత దెబ్బతినకుండా మానసిక స్థిరత్వంతో పరీక్షలకు సన్నద్ధం అవ్వాలి.
- పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు తాము చదువుకున్న పాఠ్యాంశాల నుంచే వస్తాయనే విషయం విస్మరించకూడదు.
- అనవసరమైన విషయాలు, వివాదాల జోలికి వెళ్ళకూడదు. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా తల్లిదండ్రులు సహకరించాలి.





సమర్థంగా సన్నద్ధం ..

ఇటీవల నిర్వహించిన గ్రాండ్ టెస్ట్ మార్కులకు దీటుగా మరింత సమర్థంగా పరీక్షలకు సన్నద్ధమైన విద్యార్థులని సిద్ధం చేస్తున్నట్లు డీఈవో సివి రేణుక తెలిపారు. విద్యార్థులు పరీక్షల భయం వీడితే సగం విజయం సాధించినట్లేనని తెలిపారు. రోజుకు కనీసం ఏడు గంటలు ఒక ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సాత్విక ఆహారం తీసుకోవాలని సూచించారు.

- సీవీ రేణుక, డీఈవో గుంటూరు



హోలీ వేడుకల్లో యువత సందడి

హోలీ... ఆనందాల కేళి

గుంటూరు(తూర్పు), మార్చి 14(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన ఈ విజయం... నేల నలుదిక్కులా వ్యాపించిన వసంత విలాసం.. అందరి వదనాల్లో ఆనందాన్ని చిలికించింది. ఆ సంతోషమే ఏడు రంగుల ఇంద్ర ధనస్సులా విరిసి వర్ణాల వెల్లువై కళ్లలో మెరుపు.. బుగ్గల్లో ఎరుపు.. నవ్వుల్లో భావాల వర్ణాలన్ని ఉవ్వెత్తున ఎగసి ఆనందం కింతల వేళ.. హోలీ సంబరం అంబరాన్నంటింది. ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిళ్లన్నీ కేరింతల్లో కరిగిపోగా.. మనసులోని బాధలన్ని రంగులలో కలిసిపోయి మధుర క్షణాలను మిగిలిచ్చింది. శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్నారులు, యువకులు, వృద్ధులు అందరూ కలిసి రంగు రబ్బా రబ్బా అంటూ చిందేశారు. పేద, ధనిక అందరూ ఏకమై హోలీ రంగేళి అంటూ ఆడిపాడారు. రంగులు చల్లుకుంటూ పండుగను ఘనంగా చేసుకున్నారు.

నేడు శ్రీనివాస కల్యాణం

- వెంకటపాలెంలో ఏర్పాట్లు పూర్తి
- 27 వేల మంది తిలకించేలా ఏర్పాట్లు
- భక్తుల కోసం 300 బస్సులు



వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్

తుళ్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజధానిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వద్ద శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణానికి టీటీడీ, జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం సాయంత్రం 6.30 గంటల నుండి 8.30 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. ఆలయ ఆవరణలో కల్యాణ వేదిక కళాత్మకంగా తీర్చిదిద్దారు. భక్తులు కూర్చునే గ్యాలరీలు సిద్ధం చేశారు. ఈ మేరకు టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వెల్లడించారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వెంకటపాలెం చేరేందుకు వీలుగా టీటీడీ దాదాపు 300 బస్సులు ఏర్పాటు చేసింది. తుళ్లూరు, తాడేపల్లి, తాడికొండ, మంగళగిరి మండలాల ప్రజలు సులువుగా కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరుకునేందుకు వీలుగా బస్సులు ఏర్పాటుచేశారు. విజయవాడ నుండి వచ్చేవారి కోసం మందడంలో ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణానికి దాదాపు 4 టన్నుల పూలు, 30వేల కట్ ఫ్లవర్స్ సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి ఆకులు, కొబ్బరి తోరణాలతో సుందరంగా అలంకరించారు. శనివారం సాయంత్రం 4 గంటల నుండి 6.15 గంటలకు అన్నమాచార్య సంకీర్తనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామి వారి కల్యాణాన్ని ప్రారంభిస్తారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు శ్రీవారి లడ్డు, పసుపు, కుంకుమ ప్యాకెట్, పసుపు దారం, కల్యాణ అక్షింతలు కలిపి ఒక బ్యాగ్‌లో పంపిణీ చేయనున్నారు. శ్రీనివాస కల్యాణవేదిక ప్రాంగణం ప్రాంతంలో 5వేల ఫ్లడ్ లైట్‌లు, 25 జనరేటర్లు, 18 ఎల్ఈడీ స్క్రీన్, దశావతారాల శ్రీవేంకటేశ్వరుడు, పద్మావతి అమ్మవార్ల కటౌట్‌లు, ఆలయం పరిసరాలలో 60 తోరణాలతో పాటు, వేంకటేశ్వర ఆలయంలో విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జేఈవో వీ వీరబ్రహ్మం, పలువురు జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామి వారి కల్యాణానికి పూలదండలు సిద్ధం చేస్తున్న దృశ్యం

అశ్రునయనాల మధ్య మాణిక్యవేల్ అంతిమయాత్ర

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్నుమూసిన ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ అంత్యక్రియలు శుక్రవారం పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులు, కంపెనీ ఉద్యోగులు, సిబ్బంది అశ్రునయనాల మధ్య మాణిక్యవేల్ అంతిమయాత్ర సాగింది. ముందుగా అరండల్‌పేట 10/2వ లైనులోని స్వగృహం నుంచి మాణిక్యవేల్ అంతిమయాత్ర ప్రారంభమైంది. గోరంట్లలోని ఫ్యాక్టరీ వరకు అనంతరం గోరంట్ల ఫ్యాక్టరీ నుంచి అమరావతి రోడ్డు మీదుగా కొరిటెపాడు వరకు అంతిమయాత్ర సాగింది. కొరిటెపాడులోని హిందూ శ్మశానవాటికలో మాణిక్యవేల్ అంత్యక్రియలు పూర్తి చేశారు. అంతకుముందు అరండల్‌పేటలోని నివాసంలో మాణిక్యవేల్ భౌతిక కాయం వద్ద ఎమ్మెల్యేలు గళ్లా మాధవి (గుంటూరు పశ్చిమ), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), నక్కా ఆనందబాబు (వేమూరు) పలువురు ప్రముఖులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు.



మాణిక్యవేల్ అంతిమయాత్రకు హాజరైన కుటుంబ సభ్యులు, కంపెనీ ఉద్యోగులు

- మంగళాద్రిలో వైభవంగా రథోత్సవం
- మార్మోగిన నృసింహ, గోవింద నామస్మరణ
- రథం లాగిన మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి పెమ్మసాని

జై నారసింహ



మంగళగిరి, సిటీ మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శుక్రవారం మంగళగిరి తిరునాళ్ల ఘనంగా జరిగింది. మంగళగిరి తిరునాళ్లగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీనృసింహస్వామివారి దివ్య రథోత్సవం భక్తుల జయజయ ధ్వానాల నడుమ నేత్రపర్వంగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనులతో నగరవీధులు కిక్కిరిసిపోయాయి. రథం బయలుదేరే సమయానికి పరిసర ప్రాంతాలన్నీ జనప్రవాహంతో రద్దీగా మారాయి. నృసింహుని మహారథోత్సవం ఆనవాయితీ ప్రకారం శాకున శాస్త్ర విధిని అనుసరించి నిర్వహించారు. ఆలయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉత్సవ మూర్తుల విగ్రహాలను అర్చకస్వాములు తీన్‌మార్ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి మహారథంపై అధిష్టింపజేశారు. ముం దుగా రథయాజ్ఞీకులు రథాంగ హోమం నిర్వహించి అన్నపురాశిని అష్టదిక్కులకు బలిహారణ చేశారు. రథ అధిదేవతా ఆవాహనం గావించారు. గుమ్మడికాయలు, పలు రకాల అలంకరణలతో కాషాయ ధ్వజ శోభితమైన ఈ మహారథానికి ఉత్సవ కైంకర్యపరులు మాడభూషి వేదాంతాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తదితరులు టెంకాయలను కొట్టి రథోత్సవాన్ని ఆరంభించారు. అనంతరం రథయాజ్ఞీకులు రథారూఢులైన శ్రీదే వీ, భూదేవీ సమేత శ్రీ నృసింహస్వామివార్లకు హారతినిచ్చి అనుజ్ఞ ఇవ్వగా భక్తులు జై నారసింహ అంటూ భక్తి పారవశ్యంతో మోకును లాగి రథాన్ని బయలుదేరతీశారు. గాలిగోపురం వద్ద గల రథశాల నుంచి మహారథం మె యిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు చేరుకుని తిరిగి అదే మార్గంలో రథశాల చేరింది. నృసింహుని రథోత్సవంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. జై నారసింహ, గో విందా నామస్మరణల మధ్య భక్తులతో కలిసి ఉత్సాహంగా రథం మోకును లోకేశ్ లాగారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేశ్

ప్రయోగాత్మక సాగు.. లాభాలు బాగు

- మొక్కజొన్న సాగులో ఆశించిన ఫలితాలు
- టన్ను రూ.22,500కు కొనుగోలు చేసిన సంస్థ
- ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి

కొల్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మకంగా సాగు చేసిన పాప్‌కార్న్ మొక్కజొన్న రకం సాగులో టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ ఆశించిన ఫలితాలు సాధించారు. కొల్లూరులో 40 ఎకరాల విస్తీర్ణంలో ఈ రబీలో ఆయన పాప్‌కార్న్ మొక్కజొన్న సాగును చేపట్టారు. నూజివీడు కు చెందిన సంస్థ వారు ఎకరాకు సరిపడా విత్తనాలను కేవలం రూ.వెయ్యికే అందజేశారు. 92 రోజుల కాలపరిమితి రకం కావడంతో ఆయన అధిక విస్తీర్ణంలో పాప్‌కార్న్ వేశా రు. ఇతర రకాల కాలపరిమితి 120 రోజులు ఉండటంతో పైగా పంట చేతికి వచ్చిన అనంతరం నూర్పిడి చేయగా వచ్చిన గింజలను ఆరబెట్టడం వంటి పనులు కూలీలతో చేయించాలని, పాప్‌కార్న్ రకం సాగు చేయడం వల్ల సంస్థ ప్రతినిధులు కండె గింజలు గట్టిపడిన వెంటనే కూలీలతో పంట కోయించి వారే బస్తాలకు నింపుకుని తీసుకు వెళతారని, దీనివల్ల రైతుకు ఎకరాకు రూ.4-5 వేలు ఆదా కావడంతో పాటు శ్రమ కూడా తగ్గుతుందన్నారు. టన్ను రూ.22,500కు సంస్థ వారే కొనుగోలు చేయడం రైతుకి మరింత కలిసివచ్చే విషయమన్నారు. ఈ ప్రాంతంలో తనతో పాటు మరికొంతమంది రైతులు కూడా పాప్‌కార్న్ సాగు చేపట్టారని, మూడు నుంచి మూడున్నర టన్నుల లోపే దిగుబడులు పొందారని తాను మాత్రం ఎకరాకు 4 టన్నులు పైనే దిగుబడి సాధించడం జరిగిందన్నారు. వచ్చే రబీలో పాప్‌కార్న్ రకంతో పాటు మరో నూతన మొక్కజొన్న రకాన్ని ప్రయోగాత్మకంగా సాగు చేసి అత్యధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు.



మొక్కజొన్న బస్తాలను లారీకి మారుస్తున్న కూలీలు



ప్రయోగాత్మకంగా సాగుచేసిన పాప్‌కార్న్ మొక్కజొన్న కండెలను చూపుతున్న మురళీకృష్ణ

ఇళ్లు సరే.. సౌకర్యాలు?



మాచర్ల పట్టణంలోని టిడ్కో గృహాలు

(3వ పేజీ తరువాయి)

వీరి గోడు పట్టించుకున్న వారే లేరు.

- చిలకలూరిపేట చెరువురోడ్డులో 52 ఎకరాల్లో టిడ్కో సముదాయంలో వసతులు లేని కారణంగా 4,612 గృహాలకు రెండువేల మంది కూడా నివాసం ఉండడం లేదు. పట్టణానికి 4 కి.మీ దూరంలో ఉండటంతో అక్కడకు వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేదు. మురుగు కాల్వల నిర్మాణం జరగలేదు. వీధి దీపాలు, నీటి వసతి కల్పించింది. ఆస్పత్రి, పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది పట్టణంలోనే నివాసం ఉంటున్నారు.
- సీఆర్డీఏ పరిధిలో కృష్ణయ్యపాలెంలో టిడ్కో ఇళ్లకు వెళ్లేందుకు అప్రోచ్‌రోడ్డు లేదు. కంకరతో తాత్కాలిక రోడ్డు వేసి సరిపెట్టారు. మంత్రి లోకేశ్ చొరవతో ఇక్కడ తాగునీటి సమస్య తాత్కాలికంగా తీరుతోంది. దొండపాడులో మందుబాబులు, జూదరుల దాడులతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా ఇళ్లు ఇవ్వాలి.. ఊసేలేని పనులు

రాజధాని అమరావతి పరిధిలోని 8 ప్రాంతాల్లో 5,024 ఇళ్లు, గుంటూరు సమీపంలోని అడవితక్కెళ్లపాడులో 4,192, వెంగళాయపాలెంలో 1,888, పొన్నూరులో 2,368, తెనాలిలో ఫేజ్- 1లో 848, మంగళగిరిలో 1,728, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 4,512, నరసరావుపేటలో 1,504, ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. కాగా వెంగళాయపాలెంలో ఫేజ్- 2 కింద 1,392, సత్తెనపల్లిలో 160 ఇళ్లు లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చాయి. తెనాలిలో ఫేజ్- 2లో 1,008, చిలకలూరిపేటలో ఫేజ్- 2లో 1,008 ఇళ్లు, రేపల్లెలో 1,344, వినుకొండలో 1,440, పిడుగురాళ్ల కొండమోడులో 2,832, మాచర్లలోని గొర్రెలమండీలో 1,056, ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. అద్దంకిలో 863 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టగా 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. గత ఐదేళ్ల ఎలాంటి పనులూ జరగలేదు. రేపల్లె మండలం అరవపల్లి సమీపం, రేపల్లెలోని రెండో వార్డులో 1373 టిడ్కో ఇళ్లు మంజూరైనా పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగలేదు. గత ఐదేళ్లు పాడుబెట్టడంతో టిడ్కో ప్రాంగణం చుట్టూ భారీఎత్తున పిచ్చి మొక్కలు మొలిచి దర్శనమిస్తున్నాయి పిడుగురాళ్లలో సుమారు 4 వేలకు పైగా టిడ్కో గృహాలు మంజూరు కాగా 2018 నాటికి 2,832 గృహాల్లో సుమారు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. విద్యుత్, రోడ్లు, డ్రెయినేజి తదితర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ గృహప్రవేశాలకు ముందుకు రాలేదు. సత్తెనపల్లిలోని భీమవరం డొంక రోడ్డులో 160 వరకు గృహాలను నిర్మించగా విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రహరీ నిర్మాణం కూడా జరగాల్సి ఉంది. మాచర్లలో 1056 టిడ్కో గృహాల పనులు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మందుబాబులకు నిలయాలుగా మార్చుకున్నారు. వైసీపీ పాడుపెట్టిన ఇళ్లతో పాటు గతంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి ఇళ్లను చంద్రబాబు అందిస్తారని లబ్ధిదారులు పది నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు కూడా టిడ్కో ఇళ్లపై హామీలు ఇచ్చి ఉన్నారు. అయితే ఇప్పటి వరకు టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ముందుకు రాకపోవడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



సత్తెనపల్లిలోని భీమవరం రోడ్డులో ఉన్న టిడ్కో గృహాలు

పల్నాడు వార్తలు

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

బండ్లమోటులో పీ4 సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బొల్లాపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లమోటు గ్రామంలో జరుగుతున్న పీ4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలను ఎంపీడీవో పీ సీతారామయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

17 నుంచి యోగా శిక్షణ

నరసరావుపేట టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యోగా శిక్షణ శిబిరం 17వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్దన్ శుక్రవారం తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయ ప్రాంగణం వెంకటేశ్వర కల్యాణ మండపంలో 28రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 5గంటల నుంచి 7 గంటల వరకు ప్రతిరోజు శిక్షణ ఉంటుందన్నారు. 42 యోగా భంగిమలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు నేర్పిస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యేవారు తప్పక బెడ్‌షీట్ తెచ్చుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, 9490846333, 9491665733 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఏనుగుపాలెం సబ్‌స్టేషన్‌లో 11 కేవీ బ్రేకర్ ఏర్పాటు

వినుకొండ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషనలో 11కేవీ బ్రేకర్‌ను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్.రాంబొట్ల గురువారం ప్రారంభించినట్లు వినుకొండ రూరల్ ఏఈ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్ వల్ల నాగులవరం, గోకనకొండ తదితర గ్రామాల ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. అనంతరం ఏఈలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించి బకాయిల వసూళ్లు, విద్యుత్ సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ జీఎస్‌రావు, ఏఈలు, ఏఏవోలు, జేఈలు పాల్గొన్నారు.

రేపు జన ఔషధి కేంద్రం, పెట్రోల్ బంక్‌ల ప్రారంభం

కారుమంచి (శావల్యాపురం) మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి సొసైటీ వారి ఆధ్వర్యంలో కారుమంచిలో నూతనంగా నిర్మించిన జన ఔషధి కేంద్రం, గుంటుపాలెం నుంచి వెల్లలచెరువుకు వెళ్ళే మార్గంలో నాలుగురోడ్ల కూడలిలో నూతనంగా నిర్మించిన హిందుస్థాన్ పెట్రోల్ బంక్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు కారుమంచి సొసైటీపర్సన్ ఇన్‌చార్జి సురేంద్ర బాబు, సీఈవో యేరువ వెంకట నారాయణ శుక్రవారం తెలిపారు. ప్రారంభోత్సవాల్లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర అసెంబ్లీ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొంటారన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డాక్టర్ భవనం ఆంజనేయరెడ్డి మృతి

జొన్నలగడ్డ (నరసరావుపేట రూరల్), మార్చి 14: (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన డాక్టర్ భవనం అంజనేయరెడ్డి శుక్రవారం మృతి చెందారు. డాక్టర్ బవనం అంజనేయరెడ్డి అచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరీక్షల నిర్వహణ అధికారిగా పనిచేశారు. డాక్టర్ భవనం అంజనేయరెడ్డి మృతదేహానికి పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ కొల్లి బ్రహ్మయ్య, పలువురు ప్రముఖులు అంజనేయరెడ్డికి నివాళులర్పించారు.

అమ్మవారి దేవాలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

వినుకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకంచర్ల గ్రామంలోని పోలేరమ్మ తల్లి అమ్మవారి దేవస్థానానికి ప్రహరీ నిర్మాణానికి టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

కనమర్లపూడి (శావల్యాపురం) మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలోని శావల్యాపురం మండలం కనమర్లపూడిలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి వారి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు భూమి పూజచేశారు. ఆలయ కమిటీ సభ్యులు జుజ్జూరి శ్రీనివాసరావు, పులుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుమారు రూ.30లక్షల ఖర్చుతో వీరబ్రహేంద్రస్వామి దేవాలయ నిర్మాణం, దేవాలయ ప్రాంగణంలో 30అడుగుల ఎత్తుతో స్వామివారి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామపెద్దలు గోరింట్ల హనుమంతరావు, బోడెపూడి వెంకటేశ్వర్లు, ముక్కపాటి నాగేశ్వరరావు, కాసరగడ్డ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

నాదెండ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. కెరీర్ గైడెన్స్ మోటివేటర్, సీనియర్ ఉపాధ్యాయుడు సుబ్బారావు 50మంది విద్యార్థులకు వీటిని అందజేశారు.

జామాయిల్, సుబాబుల్ సాగుకు

రైతుల మొగ్గు



ఎండుగుంపాలెం ప్రాంతంలో సాగులో ఉన్న సుబాబుల్ తోట

నాదెండ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు జామాయిల్, సుబాబుల్ సాగువైపు మొగ్గు చూపుతున్నారు. ఆ పంటల ధరలు ఆశాజనకంగా ఉండటంతో పలు గ్రామాల రైతులు సాగుపై దృష్టిపెట్టారు. వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి తదితరాలకు పెట్టుబడి వ్యయం ఎక్కువ కావటంతో పాటు ధరలు, దిగుబడులు కూడా అంతంత మాత్రంగా ఉండటంతో ఆ పంటలపై రైతులకు ఆసక్తి తగ్గుతోంది. ప్రత్యామ్నాయంగా ఈ సాగుపై రైతులు దృష్టిపెట్టారు. నాదెండ్ల మండలంలోని తూబాడు, చందవరం, ఎండుగుంపాలెం, చిలకలూరిపేట మండలంలోని కమ్మవారిపాలెం, కావూరు తదితర గ్రామాల్లో ఎనిమిది సంవత్సరాల క్రితం వరకు సుబాబులు, జామాయిల్, సరుగుడు పంటలను సాగు చేసేవారు. ఆ తరువాత జామాయిల్, సుబాబుల ధరలు క్షీణించటంతో ఆ పంటలను తొలగించి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపారు. గడిచిన ఏడాదిగా ఈ పంటలకు ధరలు పెరిగాయి. మొన్న వరకు టన్ను జామాయిల్ ధర రూ.7వేల వరకు పలికింది. అదే విధంగా సుబాబుల్ ధరలు టన్ను రూ.6వేల వరకు పలికింది. పెట్టుబడి వ్యయం తక్కువ కావటంతో పాటు దీర్ఘకాలిక పంట కావటంతో ఈ ఏడాది మరలా రైతులు సాగు ప్రారంభించారు. నియోజకవర్గంలోని సుమారు 1500ఎకరాల్లో జామాయిల్, సుబాబుల్ పంటల సాగు చేపట్టినట్టు అంచనా. వచ్చే ఏడాది ఈ పంట సాగు మరింత పెరిగే అవకాశం ఉంది.

బ్రిడ్జి తూములకు అడ్డుపడిన తూటికాడ

● పీబీసీ కాలువలో నీరు నిలిచి కట్టలపైకి ప్రవాహం

● సకాలంలో స్పందించి నాచు తొలగించిన టీడీపీ నాయకులు

● తప్పిన ప్రమాదం



బ్రిడ్జి తూములు వద్ద అడ్డుపడిన తూటికాడను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్, పీబీసీ కాలువ కట్టలపైకి వచ్చిన నీరు

యడ్లపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పీబీసీ కెనాల్‌పై యడ్లపాడు సినిమా హాలు సమీపంలో నిర్మించిన బ్రిడ్జి తూములకు గురువారం రాత్రి తూటికాడ అడ్డుపడడంతో కాలువలోని నీటి ప్రవాహం కట్టలపైకి చేరి, కట్టలు తెగిపోయే ప్రమాదం ఏర్పడింది. గమనించిన కెనాల్ సిబ్బంది స్థానిక టీడీపీ నాయకుడు, జాలాది నీటి సంఘం అధ్యక్షుడు పోపూరి రాఘవయ్యకు సమాచారం అందించారు. కాలువ వద్దకు వచ్చి పరిశీలించిన ఆయన యడ్లపాడు ఎస్టీ కాలనీ, ఖైదవోలు ఎస్సీ కాలనీల వద్ద కట్టల పైకి నీరు చేరుతుండడాన్ని గమనించారు. ఆలస్యం చేస్తే గండ్లుపడి కాలనీలోకి నీరు చేరే ప్రమాదం ఉందని హుటాహుటిన ఎక్స్‌కవేటర్‌ను రప్పించి బ్రిడ్జి తూములకు అడ్డుపడిన నాచు, తూటికాడను తొలగించారు. దీనితో బ్రిడ్జి దిగువకు నీరు ప్రవాహం సాఫీగా సాగిపోయి కట్టలకు గండ్లు పడే ప్రమాదం తప్పింది. కాలువలో సహజంగా ఏర్పడిన నాచుతో పాటు ఎగువ నుంచి నీటిలో కొట్టుకు వచ్చిన నాచు బ్రిడ్జి తూమలకు అడ్డు పడడంతో నీటి ప్రవాహం నెమ్మదించి కట్టలకు ప్రమాదం ఏర్పడిందని ఎన్ఎస్‌పి సిబ్బంది తెలిపారు.

సకాలంలో స్పందించి సమస్య పరిష్కారానికి సహకరించిన రాఘవయ్యకు కెనాల్ సిబ్బంది, కాలనీల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



సింగరచెరువును పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు, కమిషనర్, చైర్మన్ డాక్టర్ దస్తగిరి తదితరులు

ఇంటింటికీ నీరందిస్తాం

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సింగర చెరువును అభివృద్ధిచేసి ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటుచేసి పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరితో కలిసి జీవీ ఆంజనేయులు సింగర చెరువును పరిశీలించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జీవీ ఆంజనేయులు అధికారులను ఆదేశించిన నేపథ్యంలో వారం రోజులుగా సాగర్ జలాలతో సింగరచెరువును పూర్తిస్థాయిలో నింపారు. చెరువును పరిశీలించి జీవీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించకపోవడంతో ఇంటింటికి తాగునీటి పథకం పనులు నిలిచిపోయాయని, ఈ సమస్యపై శాసన సభలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, పీవీ సురేష్, కౌన్సిలర్ షకీలాతో పాటు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

ఖబరస్థాన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం మత పెద్దల కోరిక మేరకు ఖబరస్థాన్‌లో రూ.5లక్షలతో జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు జీవీ ఆంజనేయులు చేతులమీదుగా శుక్రవారం పనులు ప్రారంభించారు. అనంతరం ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఖబరస్థాన్‌ను పరిశుభ్రం చేసేందుకు మునిసిపాలిటీ నిధుల నుంచి రూ.5లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఖబరస్థాన్ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, సీసీ రోడ్లు, డ్రెయిన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం పిచ్చిమొక్కలు తొలగించిన దాఖలాలు లేవని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇమామ్‌లు, మౌజన్‌లకు జీతాలు క్రమం తప్పకుండా అందించేందుకు రూ.40కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని, ముస్లిం విద్యార్థుల కోసం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నామన్నారు. ముస్లింల ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సబ్సిడీ రుణాలను అందించనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో రూ.40లక్షల ముస్లిం నిధులతో ఖబరస్థాన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఇదిలా ఉండగా ముస్లిం మతపెద్దల సహకారంతో ఈద్గా అభివృద్ధికి శివశక్తి ఫౌండేషన్ ద్వారా సగం సొంత నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాల అభివృద్ధి

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



హోలీ పండుగ సందర్భంగా జీవీ ఆంజనేయులను గజమాలతో సత్కరిస్తున్న గిరిజన పెద్దలు

వినుకొండ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే గిరిజన తండాల అభివృద్ధి జరిగిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని సేవాలాల్ సంత్ మహారాజ్ గుడి వద్ద హోలీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జీవీ మాట్లాడుతూ సుగాలీ సోదర, సోదరీమణులతో కలిసి హోలీ వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2014-19 టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలను అభివృద్ధి చేయడం జరిగిందని, గిరిజన తండాల్లో ప్రతి వీధికి సీసీ రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా బొల్లాపల్లి మండలంలో గిరిజన తండాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని, ఆర్ఎస్ఆర్‌కు పైబడిన భూముల్లో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారో వారందరికి భూమి హక్కులు, పట్టాలేని, అర్హులైన వారందరిని గుర్తించి ఆరు నెలల్లో పట్టాలు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం సూర్యకాంతి పథకం ద్వారా సోలార్ విద్యుత్ పథకం తీసుకొని ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిలు చేయించి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రంగుల పండుగ హోలీ అందరి జీవితాలను రంగులతో నింపాలని, కష్టాలన్నీ తొలగించాలని, ప్రజల జీవితం ఆనందమయం కావాలని, హోలీ రంగులు ఇంటింట వసంతంగా కురవాలని ఆకాంక్షించారు. సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణానికి తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొని జీవీని దుశ్శాలువా, గజమాలతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా హోలీ పర్వదినం

రొంపిచర్ల, మార్చి 14 (ఆంధ్రజోతి): మండలంలోని గ్రామాల్లో హోలీ పర్వదినం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు గులాంలు, రంగునీరు చల్లుకుంటూ గడిపారు. చిన్నారులు హోలీ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. చాకలికుంట తండాలో ఈ పర్వదినాన్ని వైభవంగా జరిపారు.

● బొల్లాపల్లి: మండలంలో హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా చిన్నారులు, పెద్దలు గులాంలు చల్లుకొని హోలీ జరుపుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో, తండాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రైతును భాగస్వామ్యం చేయాలి

పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజరు కె.అమలకుమారి

నరసరావుపేట రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ 2025 వార్షిక కార్యాచరణ ప్రణాళిక లో ప్రతి ఒక్క రైతును భాగస్వామ్యం చేయాలని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. మూడు రోజుల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రైతు సాధికార సంస్థ వైస్‌చైర్మన్ టి.విజయ్‌కుమార్ జూమ్ వీడియో కాల్‌లో ప్రస్తుతం రసాయన వ్యవసాయం వల్ల పర్యావరణానికి కలిగేనష్టం అదేవిధంగా వాతావరణ అత్యవసరస్థితిపై అవగాహన కలిగించారు. ఖరీఫ్ వార్షిక ప్రణాళిక, సార్వత్రిక సూత్రాలు, పలు జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు రైతులు పండిస్తున్నఏ గ్రేడ్, ఏటీఎం, మోడల్‌లో పండిస్తున్న వరి, పత్తి, మిరప, అరటి, శనగ, మొక్కజొన్న, పంటల గురించి రైతుల విజయ గాథలను వీడియో ద్వారా సిబ్బందికి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ, డీఆర్డీఏ, ఉపాధి హామీ, సెరీకల్చర్, హార్టీకల్చర్, అన్ని శాఖల సమన్వయంతో కలిసి ప్రణాళికను తయారు చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా నవధాన్యాల సాగు భూమికి ఎంతో బాగు అంటూ మార్చి, ఏప్రిల్, మే, నెలల్లో రైతులందరూ పీఎండీఎస్ పద్ధతిని అవలంబించి వారి పొలాల్లో సాగుచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ ట్రైనర్ (ఎస్ఎఫ్ఏ) శాంతి, పల్నాడు జిల్లా ట్రైనర్ సైదయ్య, ఎస్ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, సౌజన్య, మేరీ, స్వాతి, మాస్టర్ ట్రైనర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు వెళుతూ తప్పిపోయిన బాలిక


రెండు గంటల్లో ఆచూకీ కనుగొన్న పోలీసులు

యడ్లపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం బోయపాలెం ఎస్టీ కాలనీకి చెందిన భూక్యా శంకర్‌నాయక్ రెండో కుమార్తె వసంతబాయి (10) స్థానిక వేద పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం స్కూలుకు బయలుదేరి వెళ్లింది. సుమారు 9గంటల సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్‌నాయక్‌కు ఫోన్‌చేసి పాప ఇంకా స్కూలుకు రాలేదని సమాచారం ఇచ్చారు. దీంతో కంగారుపడిన బాలిక తల్లిదండ్రులు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ సుబ్బానాయుడు, ఎస్ఐ బాలకృష్ణలు సిబ్బందితో కలసి స్థానికంగా విచారించి మార్టూరు సెంటర్‌లో ఉన్నట్లు కనుగొన్నారు.

కిడ్నాప్ యత్నమా..?

బాలిక తప్పిపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అయితే బాలిక తప్పి పోలేదని, ఓ ఆటో డ్రైవర్ బడికి బయలుదేరిన బాలికకు మాయమాటలు చెప్పి ఆటోలో ఎక్కించుకుని చిలకలూరిపేటకు తీసుకెళ్ళినట్లు సమాచారం. చిలకలూరిపేటలోని ఒంగోలు సెంటర్‌లో బాలికకు చాక్లెట్లు, బిస్కెట్లు కొనిపెట్టి మార్టూరు వెళ్ళే బస్సు ఎక్కించి మార్టూరు సెంటర్‌లో దిగు నేను వెనక వస్తానని బాలికకు చెప్పినట్లు తెలిసింది. కండక్టర్ టిక్కెట్ అడగగా బాలిక భయపడి ఏడవడంతో కండక్టర్ సముదాయించి బాలికనుంచి వివరాలు తెలుసుకుని బోయపాలెంలోని బంధువులకు ఫోన్‌చేసి బంధువులకు, పోలీసులకు తెలపడంతో పోలీసులు మార్టూరు వచ్చి బాలికను తీసుకుని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

టెక్స్ టైల్ రంగాన్ని ఆదుకోండి: అసెంబ్లీలో ప్రత్తిపాటి



చిలకలూరిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ రంగం స్థితిగతులు, టెక్స్ టైల్ రంగం దుస్థితి, ఉమ్మడి గుంటూరు జిల్లాలో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్ల చోరీ సమస్యను గురువారం శాసనసభలో స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఐదేళ్లలో జగన్ ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారం రూ.1,29,000 కోట్లు అన్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాల దుష్పరిణామాలే రాష్ట్ర విద్యుత్ రంగాన్ని, ప్రజల్ని ఇప్పటికీ పట్టిపీడిస్తున్నాయని చెప్పారు. కమీషన్ల సొమ్ము కోసం ఎక్కువ ధరకు ప్రైవేట్ సంస్థల నుంచి విద్యుత్ కొన్నారని చెప్పారు. పీపీఏల రద్దు నిర్ణయంతో రాష్ట్ర విద్యుత్ రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసిన జగన్, సోలార్ పవర్ ప్లాంట్లపై దాడులకు పాల్పడి, విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల మూసివేతే లక్ష్యంగా వ్యవహరించాడని అన్నారు. రాష్ట్ర టెక్స్ టైల్ రంగాన్ని ఆదుకోవడంపై ప్రభుత్వం వెంటనే కేంద్రంతో సంప్రదింపులు జరపాలని పుల్లారావు కోరారు. గుంటూరు, పల్నాడు జిల్లాలలోని టెక్స్‌టైల్ మిల్లులలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వేల సంఖ్యలో వచ్చి పనిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే చాలా మిల్లులు మూతపడ్డాయని అన్నారు. సమస్యను ముఖ్యమంత్రి, తక్షణం ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తిచేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్ల చోరీ సమస్య తీవ్రంగా ఉన్నదని ప్రత్తిపాటి సభలో అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కువశాతం లిఫ్ట్ ఇరిగేషన్లు చిలకలూరిపేట నియోజకవర్గంలోనే ఉన్నాయని, దాదాపు 55కు పైగా లిఫ్టుల సాయంతోనే వ్యవసాయం జరుగుతోందని వివరించారు. లిఫ్టుల ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతున్నదని చెప్పారు. సామాగ్రి దొంగతనాల కారణంగా గ్రామాలకు తాగునీరు కూడా అందని పరిస్థితి ఉందని అన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోని పసుమర్రులో మోటార్లు దొంగిలించడంతో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.4 లక్షలు చెల్లించి, అద్దెకు మోటార్లు తీసుకురావడం జరిగిందన్నారు.

శ్రీనివాసరావుకు ఏఎన్‌యూ డాక్టరేట్



మధుబాబు నుంచి డాక్టరేట్ అందుకుంటున్న దర్శి శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి రొంపిచర్ల మండలం బుచ్చిబాపనపాలెం విద్యార్థి దర్శి శ్రీనివాసరావు డాక్టరేట్ పొందారు. అర్థశాస్త్ర విభాగంలో గుంటూరు జిల్లా పరిధిలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన పథకంలో గ్రామీణ నిరుద్యోగ యువత మీద దాని ప్రభావం అనే అంశంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. డాక్టర్ ఎస్.సంజీవరావు పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించారు. అర్థశాస్త్ర విభాగాధిపతి కే మధుబాబు నుంచి డాక్టరేట్ పట్టాను దర్శి శ్రీనివాసరావు అందుకున్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

ఈపూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వివాహితను లైంగికంగా వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈపూరులో కుందుర్తి హరికృష్ణ విలేజ్ సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నాడు. గ్రామంలోనే అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గుంటకల లక్ష్మీనారాయణ షాపునకు తరచూ వస్తుండేవాడు. హరికృష్ణ షాపులో లేని సమయంలో అతని భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించగా పెద్దలకు దృష్టికి తీసుకువెళ్లటంతో అతనిని మందలించారు. కానీ లక్ష్మీనారాయణలో మార్పు రాలేదు. హరికృష్ణ భార్య గురువారం ఆటోలో వినుకొండకు వెళుతుండగా గమనించిన లక్ష్మీనారాయణ బైక్‌పై వెంబడించాడు. ఆ విషయం ఆమె భర్త హరికృష్ణకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. హరికృష్ణ అక్కడకు వెళ్ళడంతో లక్ష్మీనారాయణ అక్కడ నుంచి పారిపోయాడు. దీంతో హరికృష్ణ దంపతులు ఈపూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● శ్రీరామ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మోహన్‌చంద్

శావల్యాపురం, మార్చి14 (ఆంధ్రజ్యోతి): గుండె, క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల సౌకర్యార్థం ఈ నెల 16న శావల్యాపురం, కొత్తలూరు గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీరామ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్ శుక్రవారం తెలిపారు. సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ పబ్లిక్‌స్కూల్ ప్రారంభించి 25ఏళ్ళు అయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవీఆర్ మోహన్‌చంద్ మాట్లాడుతూ గుంటూరుకు చెందిన కిమ్స్‌చక్ర క్యాన్సర్ హాస్పిటల్, కమలాకర్ హార్ట్ అండ్ బ్రెయిన్ సెంటర్‌ల సహకారంతో ఈ వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్‌చంద్, మేఘన పాల్గొన్నారు.

రికవరీ చేసిన సెల్ ఫోన్ల అప్పగింత

చిలకలూరిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో సెల్ ఫోన్‌లను పోగొట్టుకున్న 25మందికి వాటిని రికవరీచేసి అర్బన్ పోలీసులు శుక్రవారం అప్పగించారు. బాధితులను అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ పి.రమేష్ వారికి ఫోన్‌లను అందచేశారు. చిలకలూరిపేట రూరల్ పోలీసు సర్కిల్ పరిధిలో 10 సెల్ ఫోన్లను శుక్రవారం రికవరీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి అనిల్ కుమార్ బాధితులకు సెల్ ఫోన్‌లను అందచేశారు.

అర్జీల అందజేతకు తరలిరండి: సీపీఐ నేత బాబురావు

చిలకలూరిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు నివేశన స్థలాలు అందచేయాలన్న డిమాండ్‌తో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అర్జీల అందచేత కార్యక్రమానికి ప్రజలు విచ్చేసి జయప్రదం చేయాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు శుక్రవారం కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అరు లైన పేదలకు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు చొప్పున అందచేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నివేశన స్థలాలు ఇచ్చే వరకు సీపీఐ పేదల పక్షాన నిలబడుతుందన్నారు.

నిప్పు పెట్టడంతో రోడ్డుపై కూలిన చెట్టు

నాదెండ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలూరిపేట, నరసరావుపేట మార్గంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో చెట్టు రోడ్డుపై పడటంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ సుబ్బ నాయుడు, ఎస్ఐ పుల్లారావులు సిబ్బందిని అక్కడకు పంపి జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, మార్చి14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం లైన్ల మరమ్మతులు, చెట్ల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. చిలకలూరిపేట టౌన్ 2 పరిధిలోని సాంబశివనగర్, సింగ్‌నగర్, పండరీపురం, సుగాలికాలనీ ప్రాంతాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు: ఎంఈవో

రొంపిచర్ల, మార్చి 14 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లోని జడ్పీ పాఠశాలలు, ఏపీ మోడల్ పాఠశాలల్లో ఈ నెల 17వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో బ్రహ్మేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రొంపిచర్లలోని జడ్పీ పాఠశాలలో 270మంది, రెడ్డిపాలెంలోని జడ్పీ పాఠశాలలో 170మంది, ఏపీ మోడల్ పాఠశాలలో 180మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆర్టీసీ బస్సులలో హాల్ టికెట్లను చూపి ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.